క్లుప్తంగా

ఎంపీ ప్రత్యేక పూజలు



ఎంపీ దంపతులను సన్మానిస్తున్న అర్చకులు

నారాయణఖేడ్: కర్ణాటకలోని గుల్బర్గ జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఘన్గాపూర్ శ్రీదత్తాత్రేయ ఆలయాన్ని పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం జహీరాబాద్ ఎంపీ ఎంపీ సురేష్ షెట్కార్, ఉమాదేవి షెట్కార్ దంపతులు సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు, వేదపండితులు వారిని పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ఎంపీ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వారిని ఆలయ అర్చకులు శాలువాలతో సన్మానించారు. వారి వెంట దర్శించుకున్న వారిలో న్యాల్‌కల్ మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి దంపతులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అశోక్‌కుమార్ దంపతులు ఉన్నారు.

విద్యార్థులకు ఐడీ కార్డుల పంపిణీ



నారాయణఖేడ్: ఖేడ్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 102 మంది ఇంగ్లీష్ మీడియం 6వ తరగతి విద్యార్థులకు సత్తెగామకు చెందిన రాజు పాటిల్ గుర్తింపు కార్డులను తయారు చేయించి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మన్మథకిషోర్ మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యాసంవత్సరంలో దాతలు రూ.30 వేల విలువ గల సౌండ్ సిస్టంతో పాటు 50 మంది విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్, జామెట్రీ బాక్సులు పంపిణీ చేశారు. విద్యాభివృద్ధికి దాతల సహకారం ప్రశంసనీయమని కొనియాడారు. ఉపాధ్యాయులు రాజయ్య, చంద్రశేఖర్, రాజశేఖర్, సంగ్రాం పాల్గొన్నారు.

ఖేడ్‌లో స్వచ్ఛతా హీ సేవ



స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్, సిబ్బందితో కలిసి పలువార్డుల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకుంటే ప్రబలే వ్యాధులను మహిళలకు వివరించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందజేయాలని సూచించారు. అలాగే, ప్రతి దుకాణాల వద్దకు తిరుగుతూ ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల కలిగే అనర్థాలపై యజమానులకు అవగాహన కల్పించారు.

ఓటరు నమోదుకు సహకరించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ అశోక చక్రవర్తి

నారాయణఖేడ్: ఓటరు నమోదు కార్యక్రమానికి రాజకీయ పార్టీలు సహకరించాలని ఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తి కోరారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో ఓటరు నమోదుకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు నమోదుకు సంబంధించి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారన్నారు. అర్హులైన వారంతా ఓటర్లుగా నమోదు చేయించుకోవాలన్నారు. పార్టీల నాయకుల సందేహాలను నివృత్తి చేశారు. తహసీల్దార్ భాస్కర్ పాల్గొన్నారు.

పంటలకు సస్యరక్షణ తప్పనిసరి



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ భిక్షపతి

ఝరాసంగం(జహీరాబాద్): పంటల రక్షణకు చర్యలు తీసుకోవాలని జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి సూచించారు. బుధవారం మండల పరిధిలోని మాచ్నూర్, కుప్పానగర్ గ్రామ శివారుల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంట పొలాలను కృషి విజ్ఞాన్ కేంద్ర శాస్త్రవేత్తలతో కలిసి ఆయన పరిశీలించారు.

వానొస్తే.. అగచాట్లు!

- వాగు ప్రవహిస్తే రాకపోకలు బంద్
- వాహనాల ప్రయాణమూ కష్టమే
- వంతెన, రోడ్డులేక అవస్థలు
- సిర్గాపూర్ మండలం గైర్హాన్ తండావాసుల దుస్థితి



వాగు దాటేందుకు అవస్థలు పడుతున్న గైర్హాన్‌తండా వాసులు

కల్హేర్(నారాయణఖేడ్): తండాకు రోడ్డు సౌకర్యం లేదు. మార్గమధ్యంలో వంతెన నిర్మాణానికి నోచుకోలేదు. వాగు ఉధృతంగా ప్రవహిస్తే రాకపోకలు నిలిచిపోతాయి. గిరిజనులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారు. సిర్గాపూర్ మండలం వంగ్దల్ గైర్హాన్ తండా గిరిజనుల కష్టాలు ఇవి. ఏళ్ల తరబడిగా సమస్య తీరడం లేదని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. వంగ్దల్ నుంచి గైర్హాన్ తండా మధ్యలో వాగు ఉంది. ఇక్కడి నుంచి రాకపోకలు సాగించడానికి మరో మార్గం లేదు. ప్రతిసారి వానాకాలంలో వాగు ధాటికి 5 నుంచి 10 రోజుల వరకు జలదిగ్బంధం కారణంగా ఎక్కడి వాళ్లు అక్కడే ఉండిపోతారు. వంగ్దల్ నుంచి గైర్హాన్ తండా మార్గం మట్టి రోడ్డు(పానది)పై కాలినడక నడవలేని పరిస్థితి దాపురించింది. అత్యవసర సమయంలో తండాకు అంబులెన్స్ రాదు.. ద్విచక్ర వాహనాలు నడవలేని దుస్థితి. ఆపద వస్తే సహాయం చేసేందుకు ఎవరూ రాలేని పరిస్థితి నెలకొంది. వైద్యం కోసం తరలించలేక నిస్సహాయ స్థితిలో ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ప్రతి ఏటా వర్షాకాలంలో మూడు నాలుగు నెలలు నీటిలో నుంచి రాకపోకలు సాగిస్తుంటారు.

ప్రమాదం జరిగితే ఇక అంతే..

వంగ్దల్ గైర్హాన్ తండాకు చెందిన రాథోడ్ రుక్కిబాయి(77), నెల రోజుల క్రితం ఇంటి వద్ద పాము కాటు వేసింది. మరోపక్క వర్షాలు పడుతున్నాయి. తండా పక్కనే ఉన్నా వంగ్దల్ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. రుక్కిబాయిను వైద్యం కోసం ఇంటి నుంచి బయటకు తీసుకెళ్లలేని పరిస్థితి. దిక్కుతోచని స్థితిలో కుటుంబీకులు చెట్ల రసం ఇచ్చి నాటు వైద్యం చేసినా ఫలితం లేకపోవడంతో రుక్కిబాయి ఆరోగ్యం పూర్తిగా క్షీణించి, మరణించింది.

తండాను సందర్శించిన ఎమ్మెల్యే..

నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి గైర్హాన్ తండాను సందర్శించారు. వాగులో నడిచి తండాకు చేరారు. గిరిజనులతో సమావేశం నిర్వహించారు. తండాకు రోడ్డు సౌకర్యం కలిపించి వంతెన నిర్మాణం చేపడుతామని భరోసా ఇచ్చారు.



వాగులో నడిచి వెళ్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

తమ బతుకు ఇంతేనా..



వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. తమ బతుకు ఎప్పుడు ఇలానే ఉంటుంది. ఇప్పటివరకు తండా గురించి, బాధలను ఎవరూ పట్టించుకోలేదు. వాగులో వరద పారితే దాటడం కష్టం. వాగు వస్తే ఎక్కడి వాళ్లు అక్కడే ఉండిపోతారు. రోజు భయంతో గడుపుతున్నాం.

– గుజ్జిబాయి, గైర్హాన్ తండా

వాగువస్తే బయటకు వెళ్లలేం..



వాగు ప్రవహిస్తే తండా నుంచి బయటకు వెళ్లలేం. మద్యలో వాగు ఉధృతంగా ప్రవహిస్తే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. ఎవరితో సంబంధాలు ఉండవు. ఆపదొస్తే ఎవరూ రాలేరు. దవాఖానకు పోవడం కష్టమే. కొందరు ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు చాలా జరిగాయి. వాగుకు వంతెన, కొత్తగా రోడ్డు నిర్మాణం చేపడితే కష్టాలు దూరమవుతాయి.

– మోహన్, గైర్హాన్ తండా

నల్లవాగు వరదను సాగర్‌కు మళ్లించాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మానిక్



సమావేశంలో మాట్లాడుతున్న మానిక్

కల్హేర్(నారాయణఖేడ్): నల్లవాగు వరద నీటిని నిజాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో కలిపేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతిమేల మానిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కల్హేర్‌లో ప్రజాసంఘాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నిబంధనలు లేకుండా రైతులకు రెండు లక్షల రుణమాఫీ అమలు చేయాలన్నారు. నల్లవాగు ప్రాజెక్టు ద్వారా రెండు పంటలకు సాగు నీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఖేడ్ డివిజన్ ఇన్‌చార్జి రమేష్, నాయకులు సతీష్, బాబురావు పాల్గొన్నారు.

నల్లవాగు ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలి

కల్హేర్(నారాయణఖేడ్): జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టు నల్లవాగు నుంచి సాగు నీటిని విడుదల చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోచయ్య, నాయకులు రవీందర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, సంగారెడ్డి, పలువురు రైతులు ఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డిను కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని, నల్లవాగు కాల్వల ద్వారా నీటి సరఫరాను అధికారులు నిలుపుదల చేశారని తెలిపారు. ఆయకట్టు కింద పంటలు ఎండకుండా నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

అలుగు కట్టను కాపాడండి

పటాన్‌చెరు టౌన్: మండలంలోని రామేశ్వరంబండ గ్రామంలోని కుమ్మినేని చెరువు అలుగుకట్ట తవ్వి రోడ్డు వేస్తున్న వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని మాజీ వార్డు సభ్యులు నాగరాజు ముదిరాజ్, గ్రామస్తులతో కలసి బుధవారం ఇరిగేషన్ అధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ.. అలుగు కట్ట తొవ్వి 40 ఫీట్ల రోడ్డు విస్తరణ చేపడుతున్నారని తెలిపారు. కత్వ కాల్వ తెగడం వల్ల చెరువులోకి నీళ్లు రావడంలేదని వాపోయారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వేతనాలు చెల్లించండి

మునిపల్లి(అందోల్): గ్రామ పంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓ కార్యాలయంలో సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. బుధవారం మండల కేంద్రం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు, ఇన్సూరెన్స్, ప్రమాద బీమా, ఐడికార్డ్స్ ఈ నెల 28 హెల్త్ క్యాంపు సబ్బులు, సరుకులు, నూనెలు, సంవత్సరానికి రెండు జతల బట్టలు ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దశరథ్, ఇస్మాయిల్, విఠల్‌గౌడ్, రవి, యాదమ్మ, నగేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

బీఎల్‌ఓలతో సమావేశం

కల్హేర్(నారాయణఖేడ్): ఓటర్ జాబితా సవరణపై కల్హేర్‌లో తహసీల్దార్ శివ శ్రీనివాస్ బుధవారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో కొత్తగా పేర్లు నమోదు, తొలగింపు, సవరణపై సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది లక్ష్మన్, డేవిడ్, రాజు, సాయికుమార్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి

సంగారెడ్డి ఎడ్యూకేషన్: రక్త దానం ప్రాణదానంతో సమానమని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ జిల్లా కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా రక్తదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, మోదీ పుట్టినరోజు సందర్భంగా దేశవ్యాప్తంగా 15 రోజులపాటు వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగానే భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో యువకులు పెద్ద ఎత్తున రక్తదానం చేశారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి ప్రమాదాల గురై అత్యవసర పరిస్థితుల్లో రక్త నిల్వలు లేకపోవడం వల్ల పేద ప్రజలు ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారన్నారు. పలువురికై నా రక్తం అందించాలనే ముఖ్య ఉద్దేశంతోనే కార్యక్రమం చేపట్టామన్నారు. 70 మంది యువకులు రక్తదానం చేశామన్నారు. వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు రక్తదానం చేశారు.

‘మహాలక్ష్మి’తో పేదల జీవితాల్లో వెలుగులు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్ చెరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని మండల పరిషత్ కార్యాలయంలో మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు సబ్సిడీ గ్యాస్ ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా అర్హులైన ప్రతి కుటుంబానికి రూ. 500లకే గ్యాస్ సిలిండర్ ఇవ్వనున్నట్లు తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా 35 వేల మంది లబ్ధిదారులకు సబ్సిడీ అందిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, సింధు ఆదర్శరెడ్డి, పుష్ప నగేష్, ప్రత్యేక అధికారి దేవూజ, తహసీల్దార్ రంగారావు, ఎంపీడీఓ యాదగిరి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి



రైతాంగ పోరాట సభలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు జయరాజ్

కంది(సంగారెడ్డి): తెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జయరాజ్ పిలుపునిచ్చారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో కందిలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ నైజాం, రజాకార్లు, దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా పేదల పక్షాన నిలబడి పోరాడింది కమ్యూనిస్టులేనని తెలిపారు. భూమి, భుక్తి కోసం , వెట్టి చాకిరీ విముక్తి కోసం కమ్యూనిస్టులు ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఆపోరాట ఫలితంగా 10 లక్షల ఎకరాల భూములు పేదలకు దక్కాయన్నారు. ఉద్యమంలో 4 వేల మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏళ్లుగా పేదల ఇళ్ల స్థలాల కోసం పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు నర్సింహులు, నాయకులు సుజాత, ఆనంద్, శబాన, సంజీవ, మమత, సాబెర్, రమేశ్, నాగరాజు, రాములు, నర్సింహులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి

జిల్లా శిశు సంక్షేమ అధికారి లలిత



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న జిల్లా శిశు సంక్షేమ అధికారి లలిత తదితరులు

సదాశివపేట(సంగారెడ్డి): పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలని జిల్లా శిశు సంక్షేమ అధికారి లలిత గర్భిణులకు సూచించారు. బుధవారం పట్టణంలోని కోహిర్ బెస్‌లోని అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. పోషక విలువలు కలిగిన రకరకాల ఆకుకూరలు, పళ్లు, కూరగాయలు తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా అంగన్‌వాడీ సెంటర్లకు వెళ్లి పరీక్షించుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ చంద్రకళ, సెక్టార్ సూపర్ వైజర్ మాణేమ్మ, పోషణ అభియాన్ డీసీ, సౌమ్య, టీసీ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు రగ్గుల పంపిణీ



రగ్గులు పంపిణీ చేస్తున్న జైపాల్‌రెడ్డి

జహీరాబాద్: మండలంలోని హోతి(కె) గ్రామంలో గల బాలికల గురుకుల కళాశాల విద్యార్థినిలకు బుధవారం ఉచితంగా రగ్గులు, పరీక్షల ప్యాడ్‌లను పంపిణీ చేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వంద మంది విద్యార్థినులకు రగ్గులు అందజేశారు. మల్లాని ఫోన్స్ లిమిటెడ్ టెక్నికల్ డైరెక్టర్ అవినాష్ గాధా తన సీఎస్‌ఆర్ నిధులతో రగ్గులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చలికాలం వస్తున్నందున, విద్యార్థినులకు రగ్గులు పంపిణీ చేయడం చేశామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేఖ, బీజేపీ నాయకులు ఎస్.జగన్నాథ్, విశ్వనాథ్, దుర్గయ్య, వైజ్యనాథ్, ఓంకార్, శంకర్‌రెడ్డి, అప్పర్ దిల్‌దార్, కార్తీక్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి, పాండురంగారెడ్డి, శివరాజ్‌పాటిల్, ప్రశాంత్ పాటిల్, సుధీర్ భండారి, సంతోష్ పాల్గొన్నారు.

జిల్లా పీఆర్టీయూ ఇన్‌చార్జి అధ్యక్షుడికి సన్మానం



మాణయ్యను సన్మానిస్తున్న నాయకులు

జోగిపేట(అందోల్): జిల్లా పీఆర్టీయూ ఇన్‌చార్జి అధ్యక్షుడిగా జోగిపేట బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎ.మాణయ్యను ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి ప్రకటించడంతో బుధవారం జోగిపేట బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, స్థానిక ఫ్లవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆబేద్‌లు సన్మానించారు. మండల పీఆర్టీయూ అధ్యక్షుడు నరోత్తం, పీఆర్టీయూ నాయకులు జి.అనిల్‌కుమార్, మాంజ్యానాయక్, రమేశ్, రిటైర్డ్ టీచర్స్ ఆశయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో జిల్లా స్థాయిలో పీఆర్టీయూ సంఘంలో ఉన్నత పదవులు పొందాలని కోరారు.

11 మందికి జరిమానా

పటాన్ చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 11మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు రూ. 2 వేలు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ వివరాల ప్రకారం.. సోమవారం, మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 11 మంది పట్టుపడినట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ మాజీ కౌన్సిలర్ మృతి

జహీరాబాద్: మున్సిపల్ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన మాజీ కౌన్సిలర్ క్రిష్ణవేణి(65) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఐడీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తన్వీర్, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డిలు, మాజీ కౌన్సిలర్ శేఖర్, ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. భర్త బిచ్చయ్యను ఓదార్చారు. వారి వెంట ఆయా పార్టీల నాయకులు వెంకట్, బి.జి.సందీప్, బాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి ఉన్నారు.

◆ సమస్యలు పరిష్కరించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రేటెడ్ కమ్యూనిటీ కాలనీలోని సమస్యలను పరిష్కారించాలని తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌గారి రమణ కోరారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గత కొన్ని ఏళ్లుగా రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోవడం జరిగిందన్నారు. పలుచోట్ల రోడ్లు అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్లను అభివృద్ధి చేయాలని కోరారు.

◆ ఉపాధిహామీ పనులపై గ్రామసభలు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలంలో ఉపాధిహామీ పథకం పనులపై బుధవారం గ్రామసభలు నిర్వహించారు. వంగ్దల్, అంతర్‌గాం, వాసర్‌లో డీఆర్పీలు సభలు నిర్వహించారు. ఉపాధి పనులు, నిధుల ఖర్చుపై సామాజిక తనిఖీ నివేదికను డీఆర్పీలు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఏపీఓ బస్వరాజ్ పాల్గొన్నారు.

◆ ఘనంగా సిద్ధరామేశ్వర జయంతి

మునిపల్లి(అందోల్): మండలంలోని బుదేరా ఎల్లలింగ ఆశ్రమంలో షేడక్షరీ శివయోగి సిద్ధరామేశ్వర జయంతి వేడుకలను బుధవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. పూజలకు మండలంలోని ఆయా గ్రామాల భక్తులే కాకుండా వికారాబాద్ జిల్లా మర్పల్లి, కొమిషేట్‌పల్లి గ్రామాల భక్తులు హాజరై తీర్థ ప్రసాదం తీసుకున్నారు. కార్యక్రమంలో రఘునందన్, రమేశ్, మల్లేశం, కృష్ణ, అంజన్న పాల్గొన్నారు.

◆ నకిలీ ఓటర్లను తొలగించండి

పటాన్‌చెరు టౌన్: రామేశ్వరంబండ గ్రామంలో సుమారు 380 నకిలీ ఓట్లు ఉన్నాయని, వాటిని జాబితా నుంచి తొలగించాలని మాజీ వార్డు సభ్యుడు ఐలపురం నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం పటాన్‌చెరు తహసీల్దార్ రంగారావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రామేశ్వరంబండ గ్రామానికి సంబంధం లేని వారు, తమ గ్రామ ఓటరు జాబితాలో ఉన్నారని తెలిపారు. జాబితాను పరిశీలించి, నకిలీ ఓటర్లను తొలగించాలని కోరారు.

◆ ఘనంగా పీర్‌బాబా ఉత్సవాలు

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని సింగూరు గ్రామంలో వెలిసిన హజ్రత్ మహమ్మద్ పీర్‌బాబా షావలి ఉత్సవాలు మూడు రోజుల నుంచి ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం పీఠాధిపతి మహ మ్మద్ ఆబేద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రి సాహేబ్ సందల్ నిర్వహించారు. సందల్ ఊరేగించి దర్గాకు చద్దర్ సమర్పించారు. ఈ సందర్భంగా యువకులకు వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఖవ్వాలి నిర్వహించి భక్తీ గీతాలు ఆలపించారు. ఈ దర్గాకు జోగిపేట అన్నాసాగర్ దర్గా నుంచి ఒంటెలపై సందల్ ఊరేగింపు చేశారు.

◆ దత్తాత్రేయ ఆలయంలో ప్రత్యేక పూజలు

జహీరాబాద్: మండలంలోని రంజోల్ గ్రామంలోని శ్రీదత్తాత్రేయ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి పాల్గొని పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ వేడుకగా విశ్వకర్మ జయంతి ఉత్సవాలు

నారాయణఖేడ్: విశ్వకర్మ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని నాగల్‌గిద్ద మండల కేంద్రంలోని విశ్వకర్మ ఆలయంలో బుధవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చందర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాగల్‌గిద్ద తాజా మాజీ వైస్ ఎంపీపీ పండరి యాదవ్, రాష్ట్ర ఆత్మకమిటీ మాజీ డైరెక్టర్ మారుతి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు ప్రభాకర్ పాల్గొన్నారు.

◆ గుంతల పూడ్చివేత

రాయికోడ్(అందోల్): మండలంలోని చిమ్నాపూర్-మహబత్‌పూర్, రాయికోడ్-చిమ్నాపూర్ మధ్య రోడ్డుపై పడిన ఏర్పడిన గుంతలను స్థానిక నాయకులు మోరం వేసి పూడ్చారు. గతకొన్ని నెలలుగా రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు విఠల్‌రెడ్డి, మక్సూద్‌లు సొంతఖర్చులతో మోరం వేసి జేసీబీతో చదును చేయించారు.

◆ లడ్డూను దక్కించుకున్న మహిళలు

జహీరాబాద్: పట్టణంలోని శ్రీరామ్ కాలనీలో ప్రతిష్ఠించిన మధుర గణేష్ మండపంలో నిర్వహించిన వేలంపాటలో మహిళలు పాల్గొని లడ్డూకైవసం చేసుకున్నారు. మంగళవారం రాత్రి నిర్వహించిన వేలం పాటకు హాజరై రూ.30 వేలకు లడ్డూ కైవసం చేసుకున్నారు.

◆ కొనసాగిన నిమజ్జనాలు

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమల నిమజ్జన కార్యక్రమం మనూరు మండలంలోని కమలాపూర్ చెరువులో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజామువరకు కొనసాగింది.

రూ.4.20 లక్షలు పలికిన లడ్డూ

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని పోచారం గ్రామంలోని శ్రీరామ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద లడ్డూ ప్రసాదం వేలం పాట పోటాపోటీగా సాగింది. ఈ వేలంలో అదే గ్రామానికి చెందిన తలారి నాగేష్ రూ.4.20 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. లడ్డూను దక్కించుకున్న వారిని యూత్ సభ్యులు సన్మానించి, లడ్డూ ప్రసాదం అందజేశారు.

ఇస్నాపూర్‌లో రూ.2 లక్షలు

ఇస్నాపూర్‌లో గణేష్ మహారాజ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద ఉత్సవాల ముగింపు సందర్భంగా లడ్డూ వేలం నిర్వహించారు. ఇంద్రేశం గ్రామానికి చెందిన నరేందర్‌గౌడ్ రూ.2 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు.

ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

సంగారెడ్డి క్రైమ్: జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో బుధవారం మధ్యాహ్నం వరకు మున్సిపాలిటీలో ఉన్న మొత్తం గణనాథుల నిమజ్జనం కార్యక్రమం మహబుబ్‌సాగర్ చెరువులో పూర్తయినట్లు సీఐ భాస్కర్ వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని పేర్కొన్నారు.